ఈనాడు
మంచిర్యాల
బుధవారం అక్టోబరు 2, 2024

మహాత్ముని మాట.. వెలుగు బాట


● నేడు గాంధీ జయంతి

లక్షెట్టిపేట, దండేపల్లి న్యూస్‌టుడే

నూలు వడుకుతూ, మురికి వాడలు శుభ్రం చేస్తూ సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసి పోయి భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్మించిన అనితర సాధ్యుడు ఆయన. బ్రిటిషర్లతోనే కాదు, దేశంలోని సామాజిక రుగ్మతలపై సమకాలీన పోరాటాలు చేశారు గాంధీ. అలాంటి మహాత్ముడి అడుగుజాడలే మనకు దారి దీపాలు, బాపు మాటలే బంగారు బాటలు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆశయాలను పునికిపుచ్చుకుని ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ సీమలపై 'న్యూస్‌టుడే' కథనం

మద్యపాన నిషేధం

స్వరాజ్య సాధనకు గాంధీజీ అహింసను ఆదర్శవంతమైన మార్గంగా ఎంచుకున్నారు. మద్యపానం అనేది ఉన్నత ఆశయ సాధనకు అడ్డంకి అని గ్రహించిన ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. మద్యం మత్తు సమాజాన్ని హింసా మార్గం వైపు నడిపిస్తుంది అని బలంగా నమ్మారాయన. కొన్ని గ్రామాలు స్వచ్ఛందంగా మద్య నిషేధం విధించుకుని ఆదర్శంగా నిలుస్తున్నాయి.


లింగదరి గూడెం గ్రామం

వీరు సాధించారు

నెన్నెల, బెల్లంపల్లి గ్రామీణం: బెల్లంపల్లి మండలం లింగదరిగూడెం గ్రామస్థులు గాంధీజీ ఆశయ సాధనలో మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ నివాసముండేది లింగదరి కోయలు. 60 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరు 60 సంవత్సరాలుగా మద్య, మాంసాలు ముట్టడం లేదు. ఊళ్లో పెంపుడు జంతువులను కూడా పెంచరు. ఎవరైనా చనిపోతే ఇంటి ఆవరణలోనే సమాధి చేయడం ఆనవాయితీ.

విద్య సమాజాన్ని జాతి, మత, కుల, వర్ణ వివక్షతలకు అతీతంగా దగ్గర చేస్తుంది. కొత్త రంగు, రూపాన్ని ఇచ్చి భవిష్యత్తుకు బంగరు బాటలు వేస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇంకా 7 లక్షల మంది వరకు నిరక్షరాస్యులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో వయోజనులే అధికంగా ఉన్నారు.


చందారంలో వయోజనులకు చదువు నేర్పుతున్న యువతి

చందారంలో అక్షర కాంతులు

లక్షెట్టిపేట మండలం చందారంలో నిరక్షరాస్యులైన వయోజనులకు వయోజన విద్యా శాఖ అధికారుల ఆధ్వర్యంలో వంద రోజుల పాటు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారు. శిక్షణ ఇచ్చిన యువతులు ఉచితంగా పొందిన కుట్టు శిక్షణ ద్వారా తమకు ఉపాధి మార్గాన్ని వెతుక్కోగలగడం విశేషం. విద్యావంతులైన గ్రామంలోని యువత సహకారంతో 65 మందికి అక్షర జ్ఞానం కల్పించారు.

జిల్లాలవారీగా అక్షరాస్యత శాతం ఇలా...

జిల్లా	శాతం
కుమురంభీం	59.72
ఆదిలాబాద్	65.46
మంచిర్యాల	66.37
నిర్మల్	69.09

"ప్రపంచంలో నీవు చూడాలనుకునే మార్పు మొదట నీ నుంచే ప్రారంభం కావాలి.

"శ్రమ నీ ఆయుధం అయితే గెలుపు నీకు బానిస అవుతుంది

"క్విట్ ఇండియా ఉద్యమంతో బాపూజీ దేశాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించారు. క్లీన్ ఇండియా నినాదంతో దేశం మెరుగైన స్థితిలో నిలుస్తుందని ఆయన ఆనాడే భావించారు.

పారిశుద్ధ్యం

బాపూజీ కలల సాకారానికి అనుగుణంగా గ్రామస్వరాజ్య స్థాపన కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో చెత్త డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, తడిపొడి చెత్త వేరు చేసేందుకు వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పచ్చదనం కోసం మొక్కల పెంపకం చేపట్టారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి బాటలు వేశారు.


దేవుని గూడెం గ్రామం


దేవుని గూడెంలో ఏర్పాటు చేసిన స్టీలు ప్లేట్లు, గ్లాసులు, డబ్బాలు

ప్రగతి పల్లె దేవుని గూడెం

జన్నారం మండలం దేవునిగూడ గ్రామం ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తింపు పొందింది. స్వచ్ఛతలో 98 శాతం, గుడ్ గవర్నెన్స్‌లో వంద శాతం మార్కులు సాధించింది. ప్రతి నెల క్రమం తప్పకుండా గ్రామసభలు నిర్వహించడం, జీపీ నిధుల నుంచి 750 బ్యాగులు కొనుగోలు చేసి ఇంటింటికి పంపిణీ చేయడం, స్టీల్ బ్యాంకు ఏర్పాటు ద్వారా గ్రామంలో జరిగే ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్ల వాడకం లేకుండా నియంత్రించగలిగారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త ద్వారా సంపద సృష్టి వైపు అడుగులు వేశారు.

"ఎంత గొప్పగా జీవించావో నీ చేతలు చెప్పాలి... ఎంత గొప్పగా మరణించావో సమాజం చెప్పాలి.


"చాలా సమస్యలు మౌనంతోనే పరిష్కారం అవుతాయి. కానీ మనం మాటలతో ఆ అవకాశాన్ని చేజార్చుకుంటాం.

రహదారుల నిర్మాణానికి రూ.78 కోట్లు మంజూరు


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూరు పట్టణం: ఎమ్మెల్యే వివేక్ మంగళవారం సచివాలయంలో రోడ్డు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కను కలిశారు. నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ధ్వంసమైన రహదారులతో పాటు కొత్తగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రులు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల నుంచి రూ.78 కోట్ల నిధులను మంజూరు చేశారని ఎమ్మెల్యే వివేక్ తెలిపారు.

నచ్చిన చోటుకు పోటీ..



మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

ఎట్టకేలకు విద్యుత్తు సంస్థలో బదిలీల సందడి మొదలైంది. ఒకే చోట రెండేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలు పంపించాలని ఆదేశాలు రావడం, సేకరించిన వివరాల్లో విధివిధానాల్లో తెలిపిన విధంగా 50 శాతం మాత్రమే బదిలీకి అర్హులుకాగా ఆయా ఉద్యోగుల వివరాలు కంపెనీ ప్రకటించింది. దాదాపు అన్ని విభాగాల్లో జిల్లాలో స్థానచలనం పొందేవారు భారీగా ఉన్నట్లు ఆ లెక్కలు చెబుతున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తుది జాబితా బుధవారం వెలువడనున్నట్లు సమాచారం. ప్రస్తుత జాబితాకు ఒకరిద్దరు మాత్రమే పెరగడం తప్పితే పెద్దగా మార్పులు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఇక వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 4 వరకు కొనసాగుతుండగా నియామక ఉత్తర్వులు 7న అందజేసేందుకు శాఖ సిద్ధమవుతోంది.

అధికారి స్థాయిలవారీగా స్థానచలనానికి అర్హత ఉన్న వారి వివరాలు

డీఈ	1
ఏడీఈ	8
ఏఈఈ(సివిల్)	1
ఏఈ	25
సబ్ ఇంజినీర్	17
ఏఓ	1
జేఏఓ	10
సీనియర్ అసిస్టెంట్	10
జూనియర్ అసిస్టెంట్	4

తుది నిర్ణయం.. ఎస్ఈదే

బదిలీ అయ్యేవారి సంఖ్య కంపెనీ నుంచి వచ్చినా ఆయా అధికారుల వెబ్ఆప్షన్ల అనంతరం తుది నిర్ణయం జిల్లా పర్యవేక్షక ఇంజినీర(ఎస్ఈ)దే. కాగా నచ్చిన చోటును ఎంచుకునేందుకు ఆయా ఉద్యోగులు కసరత్తు ప్రారంభించారు. జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నవారి సంఖ్య భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. కొంతమంది ప్రొటెక్షన్(సంఘాల ముఖ్య నాయకులు) తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా అధికారులకు ప్రస్తుత చోటు కదిలేందుకు ఇష్టం లేకపోయినా విధివిధానాల్లో తప్పనిసరి మార్పు ఉండటంతో దగ్గరి ప్రాంతాన్ని దొరకబుచ్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మిగతా విభాగాల పరిస్థితి ఎలా ఉన్నా ఏడీఈ, ఏఈల్లో పోటీతత్వం ఎక్కువ ఉన్నట్లు సమాచారం. కార్యాలయ పోస్టుల కంటే ప్రజలతో సంబంధం ఉన్న పోస్టుల కోసమే ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాలవారు పట్టణాలకు, కార్యాలయంలో పనిచేస్తున్న వారు బయటకు వచ్చేందుకు ఇష్టపడుతుండగా ఈ ప్రాతిపదికనే అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు ఎలాగైనా నచ్చిన చోటును పొందాలని తీవ్ర ప్రయత్నాలు, ఇతరులతో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. ఏదేమైనా సంస్థ అభివృద్ధి, వినియోగదారులకు ఉత్తమ సేవ లందించేలా పనితీరును కనబరిచేవారికి ప్రాధాన్యం ఇస్తే శాఖ మనుగడ మెరుగ్గా ఉంటుంది.

ఏడీఈల్లో..

జిల్లాలో ఎనిమిది మంది ఏడీఈల బదిలీ వేటు ఉండగా తప్పనిసరిగా డివిజన్ మారాలి. కానీ జిల్లాలో రెండే డివిజన్లు ఉండటం, ఒక డివిజన్‌లో ఇద్దరే బదిలీ అయ్యేందుకు అవకాశం ఉండటంతో కాస్త ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఉన్నచోటే అటు ఇటుగా మార్పులు ఉండనున్నాయి. ఆపరేషన్స్, కన్‌స్ట్రక్షన్స్, టెక్నికల్, ఎస్పీఎం ఇలా పలు విభాగాల్లో ఆయా పోస్టులు ఉన్నా ఒక ఆపరేషన్స్ తప్ప మిగతావన్నీ కార్యాలయాల్లో ఉండే పోస్టులే కావడంతో పోటీతత్వం పెరిగింది. ఎక్కువగా ఆపరేషన్స్ పోస్టులకే మొగ్గు చూపుతున్నారు. బదిలీ అయ్యే స్థానాలు ప్రకటించడంతో మెరుగైన చోటును దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు


మంచిర్యాలలోని ఓ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

ఈ నెల 2 నుంచి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు మంగళవారం నిర్వహించారు. రంగరంగుల పూలు.. బతుకమ్మ పాటలు, ఆడపిల్లల నృత్యాలతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు సెలవుల ముందురోజు సందడిగా కనిపించాయి. - **న్యూస్‌టుడే మంచిర్యాల విద్యావిభాగం**

కన్నవారి బాధ్యత మరవద్దు


వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఏసీసీ, న్యూస్‌టుడే: సమాజ అభ్యున్నతికి వృద్ధుల అనుభవాలు ఎంతో అవసరమని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. వృద్ధుల సంక్షేమ కోసం ప్రత్యేకంగా చట్టాలు ఉన్నాయన్నారు. పోషణ చట్టం 2007 చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులకు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు తల్లిదండ్రులు మానవ విలువలు-సంబంధాలపై నిత్యం అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పలువురు వృద్ధులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి కిషన్, ఏసీపీ ప్రకాష్, వైద్యఆరోగ్యశాఖాధికారి అనిత పాల్గొన్నారు.

సెలవులు వచ్చాయోచ్

దసరా సెలవుల నేపథ్యంలో ఆయా గురుకులాలు, వసతిగృహాలు, కస్తూర్బాల్లో చదివే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఈ నెల 2 నుంచి 14 వరకు ప్రభుత్వం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే వసతిగృహాలకు తమ తల్లిదండ్రులు రావడంతో విద్యార్థులు తమ సామాన్లు మోసుకుంటూ ఇళ్లకు బయలుదేరారు. దీంతో జిల్లా కేంద్రంలోని బస్టాండు ప్రాంగణమంతా రద్దీతో సందడిగా కనిపించింది. ప్లాట్‌ఫామ్‌లపై ఎక్కడ చూసినా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో సామాన్లతో బస్సుల కోసం ఎదురు చూస్తున్న దృశ్యాలే కనిపించాయి. బస్సులు తక్కువగా ఉండడం, సమయానికి లేకపోవడం, మరోవైపు ఉచిత ప్రయాణం కారణంగా వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం పోట్లుపడ్డారు. మంగళవారం మంచిర్యాల బస్టాండులో 'న్యూస్‌టుడే' పరిశీలనలో కనిపించిన చిత్రాలు ఇవి.


తమ సామాగ్రితో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు


తమ చిన్నారుల సామాగ్రి మోసుకుంటూ బస్టాండుకు వచ్చిన తల్లి

-మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే

భవనం ఉన్నా.. రేకుల షెడ్డులో తరగతులు


అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన భవనం


అరకొర వసతుల నడుమ సాగుతున్న రేకుల షెడ్డు

లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలోవి ఈ చిత్రాలు. గ్రామంలో అంగన్‌వాడీ-2 కేంద్రం సొంత భవన నిర్మాణం కోసం రూ. 20 లక్షలు వెచ్చించి గతేడాది భవన నిర్మాణం పూర్తి చేశారు. భవనంలో హాలు, స్టోర్ రూం, కిచెన్, వరండా లాంటి అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. నిర్మాణం గత ఏడాది ఆగస్టులోనే పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశారు. భవనం ప్రారంభించి ఏడాది దాటినా ఇప్పటికీ పక్కనే ఉన్న రేకుల షెడ్డుతో నిర్మించిన అద్దె భవనంలోనే అరకొర వసతుల నడుమ ఇంకా కొనసాగిస్తున్నారు. పిల్లల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి తక్షణం నూతన భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- **న్యూస్‌టుడే: లక్షెట్టిపేట**

డీఎస్సీ అభ్యర్థులకు నిరాశే..

● ప్రారంభం కాని ధ్రువపత్రాల పరిశీలన


ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ విధుల్లో పాల్గొన్న అధికారులు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామక పరీక్ష(డీఎస్సీ) ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసినా.. ప్రక్రియ ముందుకు సాగలేదు. జిల్లా కేంద్రంలోని కార్మెల్ హై స్కూల్‌లో డీఈవో యాదయ్య పర్యవేక్షణలో పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 288 పోస్టులకు 1:3 పద్ధతిలో మొత్తం 864 మందిని మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా అధికారుల పరిశీలన కేంద్రంలో 17 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు ఒక ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడితోపాటు ఒక స్కూల్ అసిస్టెంట్‌ను నియమించారు. పరిశీలనకు సంబంధించి నిర్వాహకులకు డీఈవో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు అందించారు. అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నప్పటికీ ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల కాకపోవడం, అభ్యర్థులకు చరవాణి, మెయిల్ సందేశాలు రాకపోవడంతో తొలిరోజు పరిశీలన ప్రక్రియ నిలిచిపోయింది. ఉత్తమ ఫలితాల సాధించి ప్రభుత్వం నుంచి వచ్చే సందేశాల కోసం ఎదురుచూసిన అభ్యర్థులకు నిరాశే ఎదురైంది.

మెప్మాలో అవినీతి మేత

● జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ రాజు సరెండర్

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

తీగ లాగితే డొంక కదిలింది.. ఫిర్యాదుల విభాగానికి వచ్చిన అర్జీని క్షుణ్ణంగా పరిశీలించడంతో అవినీతి కథ తేలింది. ఓ ఉద్యోగి బలవన్మరణానికి కారణాలపై ఆరా తీయగా పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో అక్రమాల గుట్టు రట్టయింది. దీనికి కారణమైన జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రాజును మిషన్ డైరెక్టర్ ఆఫ్ మెప్మా (ఎండీ)హైదరాబాద్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంసీ బాధ్యతలను మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు అప్పగించారు.

✦ జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, క్యాతనపల్లి, నస్పూరు, చెన్నూరు, లక్షెట్టిపేట పురపాలక సంఘాలకు నిర్వహించే పేదరిక నిర్మూలన సంస్థకు జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్‌గా రాజు పని చేశారు. ఏడు పురపాలక సంఘాల్లో మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడం, తిరిగి వాటిని వసూలు చేయించే బాధ్యతను ఆయన పర్యవేక్షిస్తారు. పురపాలక సంఘాల స్థాయిలో మళ్లీ టీఎంసీలు, సీఓలు, ఆర్పీలు పనిచేస్తారు. మెప్మాకు పీడీగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత నెలలో క్యాతనపల్లి పురపాలక సంఘానికి చెందిన ఆర్పీలు (రిసోర్స్ పర్సన్స్) ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు వేతనం చెల్లించాల్సి ఉంది. ఆరు నెలల నుంచి చెల్లించడం లేదు. ఇటీవల ఏప్రిల్ నెలకు సంబంధించిన జీతం చెల్లించారు. ఇంకా జిల్లాలో 228 మంది ఆర్పీలకు రూ.82 లక్షలు పెండింగ్ వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో పది రోజుల కిందట మెప్మాలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్ ఇండ్ల రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కుటుంబ సమస్యతో చనిపోయాడా లేక కార్యాలయంలో ఉద్యోగుల ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అనే విషయం చర్చనీయాంశంగా మారింది. డీఎంసీ రాజు విధి నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం, ఆర్పీల వేతనాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆయన భార్య బదావత్ స్వాతి పేరిట స్త్రీనిధి ద్వారా బ్యాంకు రుణం తీసుకుని 14 నెలలుగా చెల్లించడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇలా తనకు అనుకూలమై వారికి స్త్రీనిధి రుణాలు ఇప్పించారని, ఆ తర్వాత వసూలు చేయించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. విధి నిర్వహణలో డీఎంసీ రాజుపై వచ్చిన ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేసిన కలెకర్ కుమార్‌దీపక్ అతన్ని ఆ శాఖ ఉన్నతాధికారులకు సరెండర్ చేశారు.


మంచిర్యాలలో మెప్మా కార్యాలయం

శ్రీరాంపూర్‌లో 61 శాతం బొగ్గు ఉత్పత్తి

నస్పూర్, న్యూస్‌టుడే: సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబరులో శ్రీరాంపూర్ ఏరియాలో 61 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని పేర్కొన్నారు.

అందని హక్కులు.. దక్కని పథకాలు!

● 'విరాసత్' కోసం గిరిజన రైతుల ఎదురుచూపులు

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

పోడు భూములను సాగు చేసుకుని జీవనం సాగించే గిరిజనులు వివిధ కారణాలతో చనిపోతే వారి వారసులకు హక్కులు రావడం లేదు. దీంతో రైతు భరోసా, బీమా, రుణమాఫీ తదితర పథకాలకు దూరమవుతున్నారు. విరాసత్ చేయాలని బాధితులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు. చనిపోయిన వారి పేర్లతోనే పట్టా భూములు (ఆర్వోఎఫ్ఆర్) ఉండటం వల్ల పంట రుణాలు ఇవ్వలేమని బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రెవెన్యూ పట్టాలు కలిగిన గిరిజనుల భూములకు సైతం ఇదే సమస్య ఎదురవుతోంది. ఐటీడీఏ భూముల మ్యూటేషన్‌కు సంబంధించి ప్రత్యేక లాగిన్ ఇప్పటికీ లేకపోవడంతో.. విరాసత్‌లు సాధ్యపడటం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డీటీడబ్ల్యూఓ (జిల్లా గిరిజన సంక్షేమాధికారి) కార్యాలయంలో రైతుల దరఖాస్తులు వేల సంఖ్యలో పేరుకుపోయాయి.

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి 2006లో అప్పటి ప్రభుత్వం పట్టాలు అందజేసింది. మళ్లీ 2023లో పోడు పట్టాలను సర్కారు జారీ చేసింది. పట్టాదారు మృతి చెందిన అనంతరం వారసులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరు క్షేత్రస్థాయిలో పర్యటించి, వారసులేనా అని నిర్ధారించిన తర్వాత నివేదికను డీటీడబ్ల్యూఓ కార్యాలయానికి పంపుతారు. అక్కడి నుంచి ఐటీడీఏకు చేరుకుంటున్నాయి. ఈ దరఖాస్తులను ఐటీడీఏ అధికారులు వారి వద్ద ఉన్న వివరాలతో సరిచూసి, వారసుల పేర్ల మీద కొత్త పట్టా జారీ చేస్తారు. ఇదంతా మాన్యువల్‌గా (రాత పూర్వకంగా)నే జరుగుతోంది. ఈ దశల్లో లబ్ధిదారుల దరఖాస్తులు ఎక్కడ నిలిచిపోయాయో తెలియకుండా నెలలు, సంవత్సరాలు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.



విరాసత్ కోసం దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు
కుమురంభీం	5,415
నిర్మల్	2,466
ఆదిలాబాద్	6,324
మంచిర్యాల	3,148


ఉమ్మడి జిల్లాలో..
గిరిజన జనాభా : 4.98 లక్షలు
2023లో పట్టాలు తీసుకున్న రైతులు : 33,885
ఎకరాలు: 1,24,521

ఆన్‌లైన్ చేస్తే ఎంతో మేలు..

ధరణిలో ఏజెన్సీ భూములకు సంబంధించి ప్రత్యేక లాగిన్ రూపొందించాలి. విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను ఆన్‌లైన్ ద్వారా తహసీల్దార్ లాగిన్ నుంచి, ఆర్డీఓ, ఐటీడీఏ లాగిన్‌కు చేరాలి. ప్రతి పదిహేను రోజులకోసారి పెండింగ్ వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారిస్తే విరాసత్‌ల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షించే బాధ గిరిజన రైతులకు తప్పుతుంది.

సంవత్సరం నుంచి తిరుగుతున్నాం

- మేస్రం సూర్యారావు, ఇంద్రవెల్లి



మా తమ్ముడు మేస్రం రాము 2023 జూన్‌లో చనిపోయాడు. అయిదు ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ పట్టా ఉంది. కుమారుడు మేస్రం అర్జున్ పేరుతో విరాసత్ చేయాలని అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నా ఫలితం లేదు. రెవెన్యూ, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం.

లాగిన్ సమస్య ఉంది

- రమాదేవి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, కుమురంభీం జిల్లా

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సంబంధించి విరాసత్‌ల కోసం అనేక మంది రైతులు వస్తున్నారు. ఐటీడీఏ కార్యాలయంలో లాగిన్ సమస్య ఉండడం వల్ల సంబంధీకులకు పట్టాల జారీలో జాప్యం ఏర్పడుతోంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని కాల్‌టెక్స్‌లో మురుగుకాల్వలు అపరిశుభ్రంగా మారాయి. వ్యర్థ వస్తువులు పోగవడంతో మురుగుకాల్వలు నిండి దుర్వాసన వస్తుంది. - రాజేశం, కాల్‌టెక్స్

✔ దుకాణదారులు ముందు ఉన్న మురుగుకాల్వల్లో వ్యర్థ వస్తువులు వేయవద్దని ఇప్పటికే సూచించాం. వారం రోజుల్లో మురుగు కాల్వలను శుభ్రం చేస్తాం. - వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి

? యూనియన్ బ్యాంకు వీధిలోని స్వచ్ఛ భారత్‌లో భాగంగా నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు ఉపయోగపడటం లేదు. - తిరుపతి, బజార్‌ఏరియా

✔ మూత్రశాలలు, మరుగుదొడ్లు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. బోరుకు మరమ్మతులు చేయిస్తాం. - వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని దుగ్నెపల్లి, గొల్లగూడెం ప్రధానరోడ్డు పక్కన విద్యుత్తు స్తంభానికి అమర్చిన నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. నియంత్రికతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. - రమేశ్, స్థానికుడు

✔ విద్యుత్తు నియంత్రికను పరిశీలించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటాం. - భాస్కర్, డిస్కం ఏఈ, కొమ్మెర

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:

? మందమర్రి మార్కెట్‌లోని రహదారి గుంతలమయం కావడంతో వినియోగదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. - సతీష్, వ్యాపారి

✔ నిధులు విడుదలలో జాప్యం అవుతుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - వెంకటేశ్వర్లు, పుర కమిషనర్

? మందమర్రి బురదగూడెం గ్రామ సమీపంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులో మందమర్రి పేరు లేకపోవడంతో ప్రయాణికులు రాంగ్‌రూట్‌లో వెళ్లి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. - చంద్రకాంత్, పాతబస్టాండ్

✔ నేషనల్ హైవే అథారిటీ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం చేందుకు కృషి చేస్తాం. - రాజశేఖర్, ఎస్సై, మందమర్రి

ప్రాణహితలో మహిళ మృతదేహం లభ్యం

కోటపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని దేవులవాడ గ్రామ సమీపంలోని ప్రాణహిత నదిలో మంగళవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. నదిలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటన స్థలాన్ని ఎస్సై రాజేందర్ సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు. మృతురాలి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: గత నెల 24న స్థానిక బైపాస్‌రోడ్‌లో జరిగిన దాడి కేసులో బొక్కలగుట్టకు చెందిన పంగ శ్రీధర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. ఈ కేసులో 18 మందిపై కేసు నమోదుకాగా ఇప్పటివరకు పదిమందిని అరెస్టు చేశామన్నారు. మిగతా వారిని త్వరలో పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలు సీజ్


ఇసుక నిల్వలను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

నస్పూర్, న్యూస్‌టుడే: సీతారాంపల్లిలో అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేశామని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం అక్రమంగా ఇసుక నిల్వ ఉన్న సమాచారం మేరకు తనిఖీ చేశామని పేర్కొన్నారు. 135 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశామని పేర్కొన్నారు. నస్పూర్ గిర్దవార్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పార్కులో శ్రమదానం

మంచిర్యాల పట్టణం: స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా మంచిర్యాలలోని గాంధీ పార్కులో మంగళవారం మున్సిపల్ సిబ్బంది, రిలయన్స్ వ్యాపార సంస్థల సిబ్బంది శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించి చెత్తను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, పారిశుద్ధ్య విభాగం అధికారి ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు


హైజంప్‌లో పోటీపడుతున్న క్రీడాకారుడు

హాజీపూర్: గుడిపేట పోలీసు బెటాలియన్‌లో శిక్షణ పోలీసులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మంగళవారం కొనసాగాయి. పరుగు పందెం, టగ్‌ఆవార్, హైజంప్, లాంగ్‌జంప్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. కమాండెంట్ వెంకటరాములు పోటీలను ప్రారంభించారు.

4న జోనల్‌స్థాయి చదరంగం..

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల(కళాశాల) క్రీడా సమాఖ్య ఈనెల 4న అండర్-19 విభాగంలో జోనల్(ఉమ్మడిజిల్లా)స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి బాబురావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రిలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు


అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో..



భీమారంలో..


పొక్కూరు ఉన్నత పాఠశాలలో..

తీరొక్క పూలతో ముందస్తు వేడుకలు


లింగాపూర్‌లో..

ముందస్తు బతుకమ్మ వేడుకలను జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో బతుకమ్మలతో సందడి చేశారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి నృత్యాలు చేస్తూ అలరించారు. బతుకమ్మలను చూడముచ్చటగా పేర్చి ప్రకృతి పండగకు స్వాగతం పలికారు. ఉపాధ్యాయులతో కలిసి రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మను అందంగా తయారు చేసి ఆటపాటలతో సంబరాలు నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**


బెల్లంపల్లి : బతుకమ్మలతో చిన్నారులు


రెబ్బెనపల్లిలో..


వెల్గనూర్‌లో..


మందమర్రిలో..


రామకృష్ణాపూర్‌లో..


జైపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో..


మంచిర్యాలలో..


మంచిర్యాలలో..

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

తాండూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు అచ్చులాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి తెలిపారు. సోమవారం టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలికలు) లక్షెట్టిపేట్ వద్ద నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి కుస్తీ పోటీలు అండర్ 17 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థినులు సీహెచ్.హర్షిత, కె.శ్రీవల్లిలు బంగారు పతకాలను సాధించారు. వీరు 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.


ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 30న లక్షెట్టిపేట పట్టణంలో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో కె.ఐశ్వర్య(10వ తరగతి), పి.గంగాదేవి(9వ తరగతి) అండర్-14 విభాగంలో జె.కాజల్(8వ తరగతి), పి.దివ్య(8వ తరగతి), పి.సహస్ర(9వ తరగతి) ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివునూరి తిరుపతి అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కౌశిక్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఐ.పద్మజ హర్షం వ్యక్తం చేశారు. మందమర్రి మండలం బొక్కలగుట్ట హెవన్ ఆఫ్ హోప్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శన కనబర్చినట్లు తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామ సభలు

హాజీపూర్, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గుర్తించడంతోపాటు లేబర్ బడ్జెట్ తయారీ కోసం ఈ నెల 2 నుంచి గ్రామ సభలను నిర్వహించనున్నట్లు మంగళవారం ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు అక్టోబరు 2 నుంచి నవంబరు 5 వరకు గ్రామసభలు నిర్వహించి తీర్మానాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలంలోని 17 పంచాయతీలకు చెందిన 3,296 కుటుంబాలకు 3,29,500 పనిదినాలు కల్పించేందుకు రూ.16.47 కోట్ల మేరకు పనులను గుర్తించి లేబర్ బడ్జెట్‌ను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

లడ్డూ ప్రసాదం కల్తీపై నిరసన

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ చేయడంపై మంగళవారం రామకృష్ణాపూర్‌లో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పూజారుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంబాప్రసాద్, రామకృష్ణ, రాజేంద్ర, రమేష్, హరిప్రసాద్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తేవాలి

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీల్లోని తాగునీటి శుద్ధి యంత్రాలు(ఆర్వో వాటర్ ప్లాంట్) అందుబాటులోకి తేవాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంతో మరమ్మతులకు గురవుతున్నాయన్నారు.

వసతి గృహం ముందు నిరసన

హాజీపూర్: దొనబండ ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్‌ను తొలగించాలని మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వసతిగృహం ముందు నిరసన చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ వసతి గృహం వార్డెన్ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని మండిపడ్డారు. వసతిగృహాల డిప్యూటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

అన్నింటికంటే విలువైనది రక్తదానం

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలోని వ్యక్తుల ప్రాణాలు కాపాడేందుకు అందించే రక్తాన్ని దానం చేయడం ఎంతో ఉన్నతమైనదని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం రక్తం దానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమం సమన్వయకర్త వి.మధుసూదన్‌రెడ్డి, అదనపు జిల్లా వైద్యాధికారిణి డా.అనిత, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరం ప్రారంభించిన కలెక్టర్ కుమార్‌దీపక్

31 వరకు ప్రత్యేక శిబిరాల నిర్వహణ

ఏసీసీ: స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 2 నుంచి 31 వరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత అధికారులతో శిబిరం నిర్వహణ ప్రచారపత్రాలను విడుదల చేశారు. సఖి కేంద్రం అందిస్తున్న సేవలపై మహిళలకు అవగాహన కల్పించాలని, బాధితులకు తగిన న్యాయం చేయాలన్నారు.

డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేకు చర్యలు

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వేకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ పథకంలో భాగంగా వచ్చిన 55,392 దరఖాస్తుల్లో 987 దరఖాస్తులను పరిష్కరించి ఆమోదించినట్టు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహణపై చర్చించారు. సర్వే నిర్వహణకు ఏర్పాటు చేసిన బృందాలకు శిక్షణ అందించి ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని నోడల్ అధికారులు రాములు, హరికృష్ణ, గణపతిలకు సూచించారు.

డీఎస్సీలో మెరిశారు..!


భరత్ కుమార్

భీమిని, న్యూస్‌టుడే: భీమిని మండలం వీగాం గ్రామానికి చెందిన సంగర్సు బాలకిషన్, అంజలిదేవి దంపతుల కుమారుడు భరత్ కుమార్ స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రంలో 75.10 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. గురుకుల టీజీటీ, గ్రూప్-4, స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ములుగు గురుకుల పాఠశాల్లో టీజీటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. పదో తరగతి వరకు కన్నెపల్లి జిల్లా పరిషత్తు సెకండరీ పాఠశాలలో, పై చదువులు పట్టణంలో చదివినట్లు తెలిపారు.

తల్లి చనిపోయినా.. పట్టు విడవలేదు


గౌరయ్య

భీమిని మండలం వెంకటాపూర్ గ్రామ రైతు బిడ్డ బొడ్డు గౌరయ్య జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రంలో 71.87 మార్కులతో అయిదో ర్యాంకు సాధించి ఆదర్శంగా నిలిచారు. వీరి తల్లిదండ్రులు బొడ్డు మల్లయ్య, అమృత. ప్రిపరేషన్ సమయంలో తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. ఆ బాధను దిగమింగుకుని సన్నద్ధమయ్యాడు. ఒక పక్క వ్యవసాయం చేస్తూ ఇంటి దగ్గర ఉండి ఆరు నెలలపాటు సన్నద్ధమయ్యాడు. పట్టు విడవకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. 2012, 2017లో రాసి విఫలమయిన కుంగిపోకుండా మళ్లీ ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించి మూడో ప్రయత్నంలో సఫలమయ్యారు. ఒకటవ తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ పాఠశాల్లో, కళాశాల్లో చదివారు. పదవ తరగతి కన్నెపల్లి జిల్లా పరిషత్తు సెకండరీ పాఠశాల్లో పూర్తి చేశారు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆంగ్లంలో మొదటి ర్యాంకు


ప్రదీప్

నెన్నెల : మండలంలోని జెండా వెంకటపూర్ గ్రామానికి చెందిన ఎస్కూరి ప్రదీప్ కుమార్ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో మొదటి ర్యాంకు సాధించారు. వీరిది మధ్య తరగతి కుటుంబం. తండ్రి పోషం వ్యవసాయం, తల్లి అమృత వైద్యశాఖలో కాంట్రాక్టు ఏఎన్ఎంగా పని చేస్తున్నారు. మొదటి సారి రాసి ర్యాంకు సాధించడంతో గ్రామస్థులు, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అభినందించారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు, బోధించిన గురువులు

పాఠశాల లేదు.. విద్యార్థులు కలిశారు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: ఆ బడిలో ప్రస్తుతం బోధనలు జరగడం లేదు. దాదాపు 35 ఏళ్లపాటు కొనసాగి వేల మందికి విద్యాబుద్ధులను నేర్పి, వానమామలై సత్యనారాయణచార్యులు స్థాపించిన ఆ పాఠశాల మూతపడినా అందులో చదివినవారు మాత్రం శ్రీరాంపూర్‌కాలనీలోని భగత్‌సింగ్ విద్యామందిర్‌ను ఇంకా గుర్తు పెట్టుకున్నారు. 25 ఏళ్ల(1998-99) కిందట పదో తరగతి చదువుకున్న ఆయా విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. ఆ పాఠశాల ఉన్న ప్రాంతంలోని సింగరేణి గార్డెన్స్‌ను వేదికగా చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ సుమారు 70 మంది హాజరై వేడుక నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు.

దసరా, బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

చెన్నూరు: చెన్నూరు పురపాలక సంఘం పరిధి పలు వీధుల్లో దసరా, బతుకమ్మ పండగ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పురపాలక కమిషనర్ గంగాధర్, వైస్ ఛైర్మన్ నవాజోద్దీన్ తెలిపారు. పట్టణంలోని 18 వార్డుల్లో మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో రూ.4 లక్షల నిధులు కేటాయించి ఎల్ఈడీ విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి కాపాడాలని వినతి

తాండూరు(కాసిపేట): లంబాడాల కుల దైవం సిత్లా భవాని భవన నిర్మాణానికి గతంలో కేటాయించిన 15 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని గ్రామస్థులు తహసీల్దార్‌కు విన్నవించారు. మండలంలోని వరిపేట లంబాడితండా గ్రామంలోని లంబాడాలకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారని తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్థులు విన్నవించుకున్నారు. అక్రమార్కుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

నర్సింగాపూర్ యువకుడి ప్రతిభ

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన దుర్గం కృష్ణ సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్(తెలుగు) విభాగంలో జిల్లా స్థాయిలో 5వ ర్యాంకు సాధించారు. చిన్ననాటి నుంచి గ్రామీణ నేపథ్యంలో చదువుకుని జిల్లా స్థాయిలో మంచి ర్యాంకు సాధించడంపై అతడి తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తాండూరు(కాసిపేట): రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు కాసిపేట జిల్లా పరిషత్తు పాఠశాలకు చెందిన విద్యార్థి విష్ణు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి అన్నారు. మండలంలోని కాసిపేట జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థి విష్ణు ఇటీవల పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మందమర్రి మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన పోటీలో ఉత్తమ ప్రదర్శన కనబర్చారు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

దండేపల్లి గ్రామీణం: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన గాజుల నరేష్ ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 2004-05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి మిత్రులు రూ.30 వేలు పోగు చేసి మంగళవారం నరేష్ కుటుంబానికి అందజేశారు. గరిగే మురళి, ఆడె రమేశ్, కొప్పుల రవికిరణ్, సురేందర్, సునీల్ పాల్గొన్నారు.

మద్యం, డ్రోన్, డీజేపై నిషేధాజ్ఞలు

మంచిర్యాల నేరవిభాగం: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, అనుమతి లేకుండా డ్రోన్, డీజే సౌండ్స్‌పై ఉన్న నిషేధాజ్ఞలు నవంబరు 1 వరకు కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్‌కు కృషి

మంచిర్యాల అర్బన్: ప్రతీ మండలంలో ఓ గ్రంథాలయంతోపాటు జాబ్ క్యాలెండర్ ఏర్పాటయ్యేలా కృషి చేస్తామని విన్నర్స్ పబ్లికేషన్ సలహాదారుడు, మాజీ ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి పలు అంశాలపై చర్చించారు. రాబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం వారికి గ్రూప్ -1, గ్రూప్ -2లకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. న్యాయవాది నటేశ్వర్, పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలు ధరించిన ఏఈఓలు

వ్యవసాయ విస్తరణ అధికారుల నిరసన

జన్నారం, న్యూస్‌టుడే: మండలంలోని ఏఈఓలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే క్లస్టర్‌లోని ఒక ఏఈఓ 5 నుంచి 8 గ్రామాలు, ఆరు నుంచి 10 వేల ఎకరాలు సర్వే చేయటం కష్టంగా ఉంటుందన్నారు. డీసీఎస్ సర్వే కోసం గ్రామస్థాయిలో సహాయకులను నియమించాలని కోరారు.

5 వరకు కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఏసీసీ: సమానత్వం, కుల నిర్మూలన లక్ష్య సాధనకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి కృషి చేస్తుందని జిల్లా కార్యదర్శి మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 2న కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 5 వరకు జిల్లావ్యాప్తంగా ఆవిర్భావ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాజేశం, నానికుమార్, రాములు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరు వెళ్తున్నారా జాగ్రత్త

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవులకు ఊరు వెళ్తుంటే పోలీసులు సూచించే జాగ్రత్తలను పాటించాలని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడారు. ఊరు వెళ్లే ముందు పోలీసులకు, పొరిగింటి వ్యక్తులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ సామగ్రి అందజేత

బెల్లంపల్లి పట్టణం: మండలంలోని చంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)లో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు తెలిపారు. దసరా సెలవుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్.మధుబాబు చెప్పారు.



పూల పండగ.. సంస్కృతి నిండుగా..

● నేటి నుంచి బతుకమ్మ సంబరాలు

బతుకమ్మలతో మహిళలు

న్యూస్‌టుడే, తలమడుగు : సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరు బతుకమ్మ పండగ. రోజుకో ప్రత్యేకతతో.. తీరొక్క పూలతో.. ఆకట్టుకునే ఆటపాటలతో మహిళలంతా కలిసి కట్టుగా నిర్వహించుకుంటారు. పుట్టింటి నుంచి మెట్టినింటికి ఆడ బిడ్డలు చేరుకుని గౌరమ్మను కొలుస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పండగ ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఇది మహాలయ అమావాస్య రోజు(బుధవారం) ప్రారంభమవుతుంది. 'శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ చిత్రమై తోచునమ్మా గౌరమ్మ.. భారతీ సతివయ్యి బ్రహ్మకిల్లాలివై' అంటూ మహిళలు ఆటపాటలతో అలరిస్తారు. బతుకమ్మను ఆదిశక్తి స్వరూపిణిగా మహిళా లోకం వేడుకుంటోంది. ఆధ్యాత్మికతను చాటి చెబుతోంది.

ఆదిలాబాద్‌లో మాత్రం విభిన్నం

ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లాలో గతం నుంచి భిన్న సంస్కృతి ఉంది. ఇది మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఇతర జిల్లాలకు భిన్నంగా పండగను నిర్వహిస్తారు. నిర్మల్, మంచిర్యాల జిల్లాలో ప్రధాన కూడళ్లలో చిన్న గుంత తవ్వి దాని చుట్టూ గద్దెలు కట్టి వాటిపై బొడ్డెమ్మలను పేర్చి తొమ్మిది రోజుల పాటు పాటలు పాడుతూ ఆడుకుంటారు. అనంతరం దసరా కంటే ముందుగా లేదా దసరా మరుసటి రోజున ఊరి మహిళలందరూ కలిసి రకరకాల పూలతో బొడ్డెమ్మలను పేర్చి వేడుకలకు ముగింపు పలుకుతారు. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం దసరా పండగ ముగిసిన పక్షం రోజుల్లో వీలునుబట్టి చివరి రోజును నిర్ణయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలంతా అధిక సంఖ్యలో హాజరై ఆనందోత్సాహాల నడుమ వేడుకలను ముగిస్తారు.

పుట్టింటి నుంచి మెట్టినింటికి..

జిల్లాలో బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయంటే చాలు పెళ్లి చేసుకున్న మహిళలంతా తమ పిల్లాపాపలతో కలిసి పుట్టినింటికి చేరుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. అయితే జిల్లాలో ఏ పండగ వచ్చినా మెట్టినింటికే ప్రాధాన్యమిస్తారు. కాగా నెలరోజుల పాటు పండగ జరుగుతుండటంతో పుట్టింటికి చేరుకొని అక్కడే కొద్దిరోజులు ఉండి తనివితీరా తమ చిన్ననాటి స్నేహితురాళ్లతో ఆడిపాడతారు.

బావి తవ్వి పువ్వులు పేర్చి

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో విశాల ఆవరణ కలిగిన ఇంటి ఎదుట ఓ పెద్ద గుంత తవ్వుతారు. అందులో నుంచి తీసిన మట్టితో చుట్టూ గద్దెలను పేర్చుతారు. అందులో గంగా గౌరీల పేరిట ఎదురెదురుగా రెండు పెద్ద గద్దెలను, మిగిలినవి అవసరం మేరకు గద్దెలను తయారు చేసుకుంటారు. సంబరాల తొలి రోజున బాజాభజంత్రీల నడుమ యెంపల్ల చెట్టును గ్రామ శివారు ప్రాంతంలోని ఓ పొలం నుంచి తీసుకొచ్చిన గుంతలో నాటుతారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గద్దెలపై చిన్నపాటి బతుకమ్మలను పేర్చడం, రాత్రి సమయంలో అందరూ ఆటపాటల్లో పాల్గొంటారు. దసరా పండగ రోజు మాత్రం చిన్న సద్దుల బతుకమ్మగా భావిస్తారు. ఆ రోజు బతుకమ్మలను అందంగా తయారు చేసి గద్దెలపై పేర్చి నైవేద్యాలను సమర్పిస్తారు. ఇంటిల్లిపాది ఆనందంగా అక్కడే పాల్గొంటారు. ప్రతి బతుకమ్మ వద్ద రోజుకో ప్రత్యేకత ఉంటుంది. గ్రామ పెద్దల నిర్ణయం మేరకు తమకు వీలైన మంచి రోజు చూసుకుని పెద్ద సద్దుల పండగ పేరిట ముగిస్తారు. ఆ రోజు మాత్రం రాత్రి పూట పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి డప్పువాయిద్యాల నడుమ పాటలు పాడుతూ గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. తర్వాత నిమజ్జనం చేస్తారు.



మృత్యు ఘడియ

● వాహనం అదుపుతప్పి ఒకే కుటుంబంలో ఐదుగురి దుర్మరణం

ఈటీవీ - ఆదిలాబాద్ :
న్యూస్‌టుడే - ఆదిలాబాద్ నేర విభాగం

కన్ను తెరిస్తే జననం. కన్నుమూస్తే మరణం. రెప్పపాటు సమయంలో ఏం జరుగుతుందో తెలియనిదే జీవితం. అలాంటి ఘటనే సోమవారం అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని మృత్యువు కబళించింది. మరో 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా.. జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకొని జీవితాలు తలకిందులయ్యాయి.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఆదిలాబాద్ పట్టణం టీచర్స్‌కాలనీకి చెందిన సయిదా ఆఫ్రిన్(36) - మహ్మద్ మొహినొద్దీన్(43) దంపతుల కొడుకు మహ్మద్ ఫరీద్ ఉద్దీన్(14) హైదరాబాద్‌లోని మహదుల్ అబ్రార్ మదర్సాలో ధార్మిక విద్యను అభ్యసిస్తున్నాడు. అక్కడ సంవత్సర పరీక్షలు ముగియడంతో మదర్సా సోమవారం నుంచి సెలవులు ప్రకటించింది. మహ్మద్ ఫరీద్ ఉద్దీన్‌ను ఇంటికి తీసుకొచ్చేందుకు తల్లి సయిదా ఆఫ్రిన్ భర్త మహ్మద్ మొహినొద్దీన్, కూతురు ఇస్రాఫాతిమా(4), మరో ఇద్దరు కొడుకులు సాజ్ ఉద్దీన్(13), ఉస్మాన్‌ఉద్దీన్(8)తోపాటు తండ్రి సయ్యద్ మొహిజోద్దీన్(67), అన్న కొడుకు సయ్యద్ మహ్మద్ అలీ(5)తో కలిసి సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి జైలో వాహనంలో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ఫరీద్‌ఉద్దీన్‌ను తీసుకొని ఆదిలాబాద్‌కు తిరుగు ముఖం పట్టారు. అర్ధరాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఆదిలాబాద్‌కు 15 కి.మీ. దూరంలో ఉన్న మేకలగండి దగ్గర వాహనం రహదారి పక్కన ఉండే రక్షణ పిల్లర్లను ఢీకొట్టుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న సిమెంటు నాలాలో పడిపోవటంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.

మృతులు వీరే..

క్షణకాలంలో జరిగిన ఘటనలో చిన్నారులు మహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ అక్కడికక్కడే చనిపోయారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా పెద్దాయన సయ్యద్ మొహిజోద్దీన్, మొహినొద్దీన్ చనిపోయారు. మదర్సా నుంచి ఇంటికి వస్తున్న మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటన సయ్యద్ మొహినొద్దీన్ కుటుంబంలో తీరని దుఃఖాన్ని మిగల్చగా.. జిల్లాలో దిగ్భ్రాంతిని కలిగించింది.



మొహమ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్



సయ్యద్ మహ్మద్ అలీ



ఫరీద్‌ఉద్దీన్



మొహినోద్దీన్



సయ్యద్ మొహిజోద్దీన్

భర్త పిల్లలేరి?

తీవ్రంగా గాయపడిన సయిదా ఆఫ్రిన్ పరిస్థితి దయనీయంగా మారింది. భర్త మహ్మద్ మొహినోద్దీన్, తండ్రి సయ్యద్ మొహిజోద్దీన్, కొడుకులు మహ్మద్ ఫరీద్ ఉద్దీన్, మహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్, అన్న కొడుకు మహ్మద్ అలీ చనిపోయారని తెలిసి ఆమె దుఃఖంతో తల్లడిల్లింది. ఊహించని ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి బేల చూపులు చూస్తున్న కూతురు ఇస్రా ఫాతిమా, కొడుకు సాజ్ ఉద్దీన్‌ల దయనీయస్థితి అందరిని కంటతడి పెట్టించింది. భారీగా తరలివచ్చిన బంధువుల అశ్రునయనాల మధ్య మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్‌లోని ఈద్గా ఖబ్రస్థాన్‌లో అంత్యక్రియలు ముగిశాయి.

కాల్‌టెక్స్ కష్టాలు



బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి కాల్‌టెక్స్ ప్రాంతం పరిస్థితి ఘోరంగా ఉంది. మంచిర్యాలకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను నెలల తరబడిగా శుభ్రం చేయకపోవటంతో దుర్గంధం వ్యాపించి వ్యాధులకు కారణమవుతోంది. దుకాణాల వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని మురుగు కాలువల్లో వేస్తున్నప్పటికీ బల్దియా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

సమీక్షలే ముఖ్యం..

సమస్యలపై నిర్లక్ష్యం

ఈటీవీ-ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాధులతో అల్లాడుతోంది. ఊరు, వాడా తేడా లేకుండా జ్వరాలు, కీళ్లు, ఒళ్లు నొప్పులతో జనం కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. వైద్యారోగ్య, బల్దియా, పంచాయతీ, డీఆర్‌డీఏ శాఖల సమన్వయ లోపంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత కనిపించడం లేదు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల విధి నిర్వహణపై దృష్టిసారిస్తున్న ఉన్నతాధికారులు జిల్లా అధికారుల పనితీరును పరిగణనలోకి తీసుకోకపోవటంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది.

ఈ ఏడాది ఫిబ్రవరి 2న జడ్పీ, మండల, పంచాయతీల పాలన ముగియటంతో ప్రత్యేక అధికారుల పాలన అందుబాటులోకి వచ్చింది. పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమితులైన అధికారులు ఇచ్చే నివేదికలపై సమీక్షలు చేయడమే తప్పితే క్షేత్రస్థాయిలోని సమస్యలను ఉన్నతాధికారులు దృష్టి సారించటం లేదు. పల్లె, పట్టణాల్లో ఫాగింగ్, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ చేయడం లేదు. శుభ్రం చేయని మురుగు కాలువలు రోగాలు ప్రబలడానికి కారణమవుతున్నాయి. తాగునీటి వసతుల క్లోరినేషన్ జరగడం లేదు. వాటికి కేటాయిస్తున్న నిధుల లెక్క తేలడం లేదు.

☛ బేల మండలం గణేష్‌పూర్‌లోని పల్లె క్రీడా ప్రాంగణం దస్త్రాల్లో చూపించుకోవడానికి తప్పితే అక్కడ దేనికీ ఉపయోగపడటం లేదు. పిచ్చిగడ్డి పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	మున్సిపాలిటీలు
ఆదిలాబాద్	17	473	01
నిర్మల్	18	400	03
ఆసిఫాబాద్	15	335	01
మంచిర్యాల	16	311	07



ప్రబలుతున్న రోగాలు : జ్వరంతో బాధపడుతున్న వీరు తిర్యాణి మండలం చింతపెల్లికి చెందిన అత్తా కోడళ్లు చేదం పోశక్క, లక్ష్మి. నెలరోజులుగా కీళ్ల, ఒళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. తిర్యాణి, మంచిర్యాలలో చూపించుకున్నా నొప్పులు తగ్గటం లేదు. తిర్యాణి సహా పెరకపల్లి, తెలండీ, రాళ్లకన్నెపల్లి, గంభీరావుపేట, చెల్మెల, నాయకపుగూడలో ఇదే దయనీయ పరిస్థితి ఉంది.

నిర్మల్ బొమ్మకు జాతీయ ఖ్యాతి

● పర్యాటక దినోత్సవం సందర్భంగా వరించిన అవార్డు

నిర్మల్, న్యూస్‌టుడే: కళకు మహత్తరమైన శక్తి ఉంటుంది. అచేతనంగా భావించే అనేక వస్తువులపై కళాకారుల చూపు పడగానే చేతనత్వంగా మారుతున్నాయి. వారి కర స్పర్శతో అవి పులకితమై అపూర్వ కళాఖండాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అటు తేలికపాటిగా ఉండే పొనికి కర్రతో బొమ్మలు తయారుచేస్తూ ఇటు ప్రకృతి రంగులతో చిత్రాలు గీస్తూ నిర్మల్‌కు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తున్నారు.. ఇక్కడి కళాకారులు. 400 ఏళ్ల నుంచి బొమ్మలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తూ ఆ 'కళ'ను బతికిస్తున్నారు. సజీవంగా కళ్లకు కట్టినట్లు కనిపించే ఈ బొమ్మలతో నిర్మల్‌కు ఎన్నోసార్లు గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గత నెల 27న దిల్లీలో జరిగిన కార్యక్రమంలో హస్తకళ విభాగంలో కొయ్య బొమ్మలకు నిలయమైన నిర్మల్‌ను 'ఉత్తమ పర్యాటక గ్రామం' అవార్డు వరించింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, కొయ్య బొమ్మల పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పెంటయ్య ఈ అవార్డును అందుకున్నారు.



ఇచ్చిన అవార్డు



కళాకారులు చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలు

40 కుటుంబాలు..

నాలుగు శతాబ్దాల క్రితం నిర్మల్‌ను పాలించిన నిమ్మనాయుడు తన వెంట కళాకారులను తీసుకొచ్చి ఇక్కడ స్థిరనివాసం కల్పించారు. అప్పటి నుంచి దాదాపు 40 కుటుంబాలు (నగిశి) కళను నమ్ముకొని జీవిస్తున్నాయి. అయిదారు తరాల నుంచి ఇక్కడి కళాకారులు బొమ్మలు తయారుచేస్తున్నారు. బొమ్మల తయారీ వెనుక మహిళల హస్తకళ దాగి ఉంది. ఇళ్లల్లో మహిళా కళాకారుల చేతిలో ఆకులో ఆకై, బొమ్మలో బొమ్మై, కొమ్మలో కొమ్మై, పువ్వులో పువ్వై జీవకళ సంతరించుకుంటుంది. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఈ బొమ్మల తయారీలో మహిళా కళాకారులు తమ నైపుణ్యాన్ని చూపుతున్నారు. వివిధ జంతువులు, పక్షులు, పిచ్చుకలు, నెమళ్లు, పోపుల పెట్టె, పులులు, సింహాలు, నోరూరించే పండ్ల నమూనాలు, ఇలా ఇంకెన్నో బొమ్మలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. సహజత్వం, సమ్మోహనం ఇక్కడి కళాకారుల ప్రత్యేకత.

డిమాండ్ బాగుంది..

నిర్మల్ కొయ్యబొమ్మలు రాష్ట్రంతో పాటు దేశంలో పలు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి నుంచి హైదరాబాద్ లేపాక్షికి పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఈ బొమ్మను ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం కర్రతో ఆకట్టుకునేలా బొమ్మలే ఉపయోగపడేలా తయారు చేస్తుండటంతో మంచి డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల విలువ గల బొమ్మలు విక్రయిస్తున్నారు. అమెరికా, ఇంగ్లాండ్ దేశాలతో పాటు ఇతర దేశాలకు పంపిస్తున్నారు.

రంజీ ట్రోఫీ పోటీలకు హిమతేజ ఎంపిక



ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి చెందిన కె.హిమతేజ బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి తొలి క్రీడాకారుడిగా చరిత్రను సృష్టించారు. తన ఎనిమిదేళ్ల కలను సాకారం చేసుకున్నారు. ఈ నెల 11, 18వ తేదీల్లో డెహ్రాడూన్‌లో నిర్వహించే రంజీ ట్రోఫీ పోటీల్లో ఆయన హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. అండర్-19, 23 ఏళ్ల విభాగంలో ఆయన సీకే.నాయుడు, బుచ్చిబాబు స్మారక పోటీల్లో పరుగుల వర్షం కురిపించారు. హైదరాబాద్ జట్టుకు సారథిగానూ రాణించారు.

డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎడ్ ప్రవేశాల కోసం డీసెట్ రాసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో మంగళవారం సజావుగా జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల నుంచి 36 మంది అభ్యర్థులు తరలివచ్చారు. తమ ధ్రువపత్రాలను సమర్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా. కోల కిరణ్, సూపరింటెండెంట్ భోజన్న తదితరులు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వెబ్ ఆప్షన్లు ఆన్‌లైన్‌లో పెట్టుకుని సీటు అలాట్‌మెంటు తర్వాత కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు బాసర ముస్తాబు



భక్తుల కోసం ఏర్పాటుచేస్తున్న క్యూలైన్లు

ముథోల్ (బాసర), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు బాసర అమ్మవారి ఆలయం ముస్తాబు అవుతోంది. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయాధికారులు చెప్పారు. దసరా సందర్భంగా ఆలయంలో అభిషేకాలు ఉండవు. కేవలం పూజలు మాత్రమే నిర్వహిస్తారు. అభిషేకం, కుంకుమ పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. తొమ్మిది రోజుల్లో రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నదానం చేస్తారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు.

కవ్వాల్ సఫారీకి వేళాయె

● మూడు నెలల అనంతరం నేడు ప్రారంభం

జన్నారం, న్యూస్‌టుడే: కవ్వాల్ అందాలు ఎప్పుడెప్పుడు తిలకిద్దామా అని ఎదురుచూస్తున్న పర్యాటకులకు ఆ రోజు రానే వచ్చింది. దట్టమైన అడవి మధ్యలో చెంగున ఎగిరే జింకలు, పురివిప్పి నర్తించే మయూరాలు, కాజ్‌వేల నుంచి జాలువారే జలపాతంలాంటి నీటి వయ్యారాలను చూసి మురిసిపోవడానికి మరికొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలలపాటు సఫారీ వాహనాల రాకపోకలను నిషేధించిన అటవీశాఖ బుధవారం నుంచి వాటిని పునఃప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వర్షాలు అధికంగా కురవడం, అడవిలో నివసించే అన్ని రకాల జంతువుల కలయికకు అనువైన సమయంగా భావించి ప్రతీ ఏడాది మూడు నెలలపాటు అడవిలోకి వెళ్లడానికి ఎలాంటి అనుమతులు ఉండవు.

ఎంత చెల్లించాలంటే..



బైసన్‌కుంట వద్ద సఫారీ వాహనం ఎక్కుతున్న పర్యాటకులు

జంగిల్ సఫారీలో రెండు గంటలపాటు అన్నీ మరిచిపోయి అడవిలో తిరిగి రావడానికి శని, ఆదివారం ఒక్కో వాహనానికి రూ.4 వేలు తీసుకుంటారు. మిగిలిన రోజుల్లో రూ.3,500 వసూలు చేస్తారు. ఒక్కో వాహనంలో ఆరుగురు ప్రయాణించాలనే నిబంధన ఉంది. ఒకవేళ అదనంగా ఒకరు లేదా ఇద్దరు వెళ్లాలంటే మాత్రం ఒక్కొక్క వ్యక్తికి రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అటవీశాఖ ఆధ్వర్యంలో నాలుగు కొత్తవి, ఒక పాత వాహనం నడుస్తున్నాయి. ఉదయం 6.30 గంటలకు అడవిలోకి వెళ్లే వాహనం 8.30 వరకు తిరుగు పయనం అవుతోంది. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు వెళ్లే వాహనం సాయంత్రం 5.30 గంటల వరకు అడవిలో ప్రయాణం పూర్తి చేసుకుంటుంది. ప్రతి రోజు మూడు ట్రిప్పులు వెళ్లే వాహనాలకు మంగళవారం మాత్రం సెలవు.

ఎక్కడెక్కడ తిప్పుతారంటే..

సఫారీ వాహనాన్ని ఆన్‌లైన్‌లోగానీ నేరుగా గాని బుక్ చేసుకోవచ్చు. వాహనంలో ఎక్కిన పర్యాటకులను వెల్ కం కవ్వాల్ టైగర్ జోన్ బోర్డు వద్ద నుంచి గోండుగూడ బేస్‌క్యాంపు, నీలుగాయికుంట, బైసన్‌కుంట వరకు తీసుకెళ్తారు. ఆయా కుంటల వద్ద ఫొటోలు దిగడానికి, కొద్దిసేపు సేద తీరడానికి అవకాశం కల్పిస్తారు. తిరిగి కడెం ప్రధాన కాలువగుండా మైసిపెల్లి బీట్ నుంచి హనుమాన్ మందిరం వరకు వెళ్లి ప్రధాన రహదారి చేరుకుంటారు. ప్రయాణంలో ఎన్నెన్నో మూగజీవాలు తారసపడుతుంటాయి. ఇక్కడ చుక్కల దుప్పుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అడుగడుగునా అవి కనిపించి కనువిందు చేస్తాయి. వన్యప్రాణులు, పక్షులను చూసే అవకాశాలు ఉన్నాయి. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రెండు పాత సఫారీ వాహనాలు ఉన్నాయి. శని, ఆదివారాల్లో రూ.2 వేలు, మిగిలిన రోజుల్లో రూ.1,500 వసూలు చేస్తారు. అడవి అందాలను చూపించేందుకు జంగిల్ సఫారీ వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. మరి అడవిలో పయనించేందుకు మీరు సిద్ధమేనా...!



నీలుగాయి కుంట వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



సొనాలలో బ్రహ్మోత్సవాల్లో మంగళహారతులతో మహిళలు

సొనాలలో సీతారాముల బ్రహ్మోత్సవాలు

● రేపటి నుంచి వేడుకలు ప్రారంభం

న్యూస్‌టుడే, సొనాల(బోథ్) : బోథ్ మండలం సొనాలలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ఘనంగా సీతారాముల బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ప్రతి రోజూ సాయంత్రం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో గ్రామస్థులు రాముడు, సీత, లక్ష్మణుడి విగ్రహాలను ఘనంగా ఊరేగిస్తారు. ఊరంతా ఏకమై ప్రతి రోజు మహిళలు మంగళహారతులతో రథానికి స్వాగతం పలుకుతారు. గ్రామంలో 2016లో రామాలయ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించిన తుల నారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురువారం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి.

తొమ్మిది రోజులు కనులపండువగా..

తొమ్మిది రోజుల పాటు తొమ్మిది వాహనాలపై విగ్రహాలను ఊరేగించనున్నారు. సూర్యప్రభ, చంద్రప్రభ, కల్పవృక్షం, గరుడ, హనుమంత, గజ, పెద్ద శేష వాహనం, చిన్న శేష వాహనం, హంస వాహనాలపై విగ్రహాలను ఊరేగిస్తారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా గ్రామానికి తరలివస్తారు. గ్రామంలోని యువత, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు అందరిని బ్రహ్మోత్సవాల్లో భాగం చేస్తారు. 2015లో గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులు దసరా సెలవుల్లో శ్రీవారి సేవకు వెళ్లగా అక్కడ బ్రహ్మోత్సవాలను చూశారు. ఖానాపూర్, లక్ష్మణ్‌చాంద, మెట్‌పల్లి లాంటి ప్రాంతాల్లో దసరాకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండటం చూసి గ్రామంలోనూ ప్రారంభించారు.



విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాలు

- జి.వి.రమణ, రామాలయ కమిటీ అధ్యక్షుడు, సొనాల

సొనాలలో ఎనిమిదేళ్లుగా గ్రామస్థుల సహకారంతో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నాం. కమిటీ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతున్నాం. గ్రామంలో తొమ్మిది రోజుల పాటు పండగ వాతావరణం నెలకొంటుంది.